ఎందుకిలా..?

-పెట్రోల్ బంకుల్లో నోస్టాక్ బోర్డు -బారులు తీరుతున్న వాహనదారులు

-చెల్లింపు విధానాల్లో మార్పు వల్లే అంటున్న నిర్వాహకులు

బాలానగర్‌లోని పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరిన వాహనాలు

హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త:

ఎంకి పెళ్లి సుబ్బి సావుకు వచ్చినట్లు ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ దేశాలు అల్లాడిపోతున్నాయి. డిమాండ్‌కు సరఫరా చమురు లభ్యత లేకపోటవంతో చాలా దేశాల్లో వంట గ్యాస్‌తో పాటు ఇంధన కొరత ఏర్పడింది. ఇప్పుడి సెగ హైదరాబాద్ నగరాన్ని కూడా తాకింది. నగరంలో పెట్రోల్, డీజిల్ లభ్యతపై ఆందోళన నెలకొంది. జనం బంకుల ముందు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా పలుచోట్ల స్టాకు అయిపోయి పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. అయితే ఇందుకు గల కారణాలను పరిశీలిస్తే గతంలో ఆయిల్ సంస్థలు డబ్బులు తీసుకోకుండానే తొలుత డీజిల్, పెట్రోల్ బంకులకు సరఫరా చేసేవి. స్టాక్ సేల్ అయ్యాక ఒకటి రెండు రోజుల తర్వాత బంకుల యజమానులు ఆయిల్ సంస్థలకు తిరిగి డబ్బులు చెల్లించేవారు. కానీ మూడు నాలుగు రోజులుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎంత ఇంధనం కావాలంటే ఆ మేరకు డబ్బులు చెల్లిస్తేనే పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తామని ఆయిల్ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో నగరంలో పలు బంకులకు సరఫరా నిలిచిపోయింది. పాతబకాయిలు వెంటనే చెల్లించాలని కొత్తగా స్టాక్‌కు డబ్బులు ముందే చెల్లించాలని ఆయిల్ సంస్థలు చెబుతుండడంతో నిర్వాహకులు సమయానికి డబ్బులు చెల్లించకపోవడంతో ఆయిల్ సరఫరా కావడం లేదు దీంతో పెట్రోల్ ఉన్న బంకులపై ఒత్తిడి పెరిగి ఒక్క రోజులోనే స్టాకు అయిపోతోంది. మళ్లీ స్టాకు వచ్చేవరకు ఆ యా బంకులు మూతపడుతున్నాయి. కాగా, ఆయిల్ కంపెనీలు ఉద్దేశ పూర్వకంగానే ఇబ్బందులకు గురిచేస్తున్నాయని బంకుల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కొత్తగా మార్పులు తీసుకురావటం సరైందికాదని అంటున్నారు. ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకుల మధ్య ఏర్పడిన వివాదంతో హైదరాబాద్ నగరంలో పెట్రోలు బంకులు మూతపడుతున్నా పౌరసరఫరాలశాఖ చోద్యం చూస్తోందని బంకుల యజమానులు వాపోతున్నారు. పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని చేతులు దులిపేసుకుంటున్నారే తప్ప కావాల్సిన చర్యలు తీసుకోవటం లేదని విమర్శిస్తున్నారు.

కాగా, హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత లేదని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. డిపోలలో తగినంత ఇంధనం ఉందని అంటున్నారు. ప్రజలు అనవసరంగా ఆందోళనకు గురై తమ వాహనాలను ఫుల్ ట్యాంకులు చేసుకునేందుకు ఎగబడటం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ముందస్తు చెల్లింపు విధానాల్లో చేసిన కొన్ని మార్పుల వల్ల బంకు యజమానులకు తాత్కాలిక సమస్య ఏర్పడిందని చెబుతున్నారు.

హైదరాబాద్ వార్త

నగరవాసులకు ఆర్టీసి శుభవార్త

-టికెట్ ధరపై 30శాతం రాయితీ -మెట్రో ఏసీ, మెట్రో డీలక్స్ బస్సులకు వర్తింపు

హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త:

ప్రస్తుతం దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా.. చమురు సరఫరా నిలిచిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వార్తలు నగరవాసులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్న వేళ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు పెంచేందుకు చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పింది. హైదరాబాద్ నగర పరిధిలో తిరిగే బస్సుల్లో ఇచ్చే టికెట్లపై 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. అయితే కేవలం మెట్రో ఏసీ, మెట్రో డీలక్స్ బస్సుల్లో మాత్రమే ఈ 30 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రకటించింది.పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ.. ఆర్టీసీ బస్సులు ఉండడ అని ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు. పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూ లైన్లలో వే

చూసి.. అనవసరంగా సమయాన్ని వృథా చేసుకోవద్దని.. సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చాలని ఆర్టీసీ ఎండీ కీలక సూచనలు చేశారు. పెట్రోల్ కష్టాల నుంచి హైదరాబాద్ నగర ప్రజలకు విముక్తి కల్పించడంతోపాటు.. ప్రజా రవాణాను మరింత ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో కొన్ని పెట్రోల్ బంకులు మూతపడటం, మిగిలిన పెట్రోల్ పంపుల వద్ద భారీగా వాహనాలు నిలిచిపోవడంతో.. ప్రభుత్వ రవాణాను ఉపయోగించుకోవాలని హితవు పలుకుతున్నారు. బైక్‌లు, కార్లలో ఒక్కరు వెళ్లి పెట్రోల్, డీజిల్‌ను అనవసరంగా వృథా చేయడం కంటే.. ఆర్టీసీ బస్సులు ఎక్కి ఆఫీసులు, పనులకు వెళ్లి.. వాటిని ఆదా చేయవచ్చని సూచిస్తున్నారు. నగరం నలు మూలలకు ఏసీ, డీలక్స్ బస్సులను ఆర్టీసీ నడుపుతోందని.. తాజాగా ప్రకటించిన 30 శాతం డిస్కౌంట్‌ను ప్రయాణికులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంటున్నారు. ప్రయాణికుల కోసం హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం 3200 బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు. ప్రధాన రూట్లలో బస్సులను మరింత పెంచి.. సకాలంలో నగరవాసులు గమ్యస్థానాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేసి నట్లు వివరించారు. ప్రయాణికుల రద్దీ పెరిగితే.. అందుకు అనుగుణంగా డిపోల్లో ఉన్న రిజర్వ్ బస్సులను కూడా నడిపేందుకు ఆర్టీసీ రెడీగా ఉందని స్పష్టం చేశారు.

నగరంలో వర్షం..పలుచోట్ల వడగండ్ల వాన

హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త:

గత కొద్ది రోజులుగా ఎండ వేడిమి కారణంగా పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న నగర వాసులకు తాజాగా కురిసిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షపు జల్లులు కురిశాయి. మరికొన్నిచోట్ల వడగండ్ల వాన పడింది. దీంతో నగరవాసులకు కాస్తంత ఉపశమనం లభించినట్లయింది. నగరంలోని భాగ్యలత, హయత్ నగర్, సాహెబ్‌నగర్, గాయత్రీనగర్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో మోస్తరు జల్లులు కురిశాయి. ఆకస్మాత్తుగా కురిసిన వర్షాలతో పలుచోట్ల రోడ్లపై వరద నీరు వచ్చి చేరింది. దీంతో అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులకు కాస్త ఇబ్బంది కలిగింది. మరోవైపు వాహదారులు, పాఠశాలల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు వరదనీటి కారణంగా స్వల్పంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్రంలో మూడు రోజుల పాటు పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదే సమయంలో 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయడంతోపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

కారుపై పడిన చెట్టు ....తప్పిన పెను ప్రమాదం

సైదాబాద్, మార్చి 25 ప్రభాతవార్త: బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి కర్మన్‌ఘాట్ చౌరస్తా సమీపంలోని సింధూర హోటల్ పక్కన సందులో ఒక ఇంటి ముందు నిలిపి ఉన్న ఒక కారుపై ఒక భారీ వృక్షం ఒక్కసారిగా విరిగి పడింది. ఈ సంఘటనలో కారు పూర్తిగా ధ్వంసమైంది. అయితే ఆ సమయంలో కారులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు ఆ ఇంట్లో కిరాయికి ఉండే వారిదని స్థానికులు తెలిపారు.

చెట్టు పడడంతో ధ్వంసమైన కారు

సమాచారం అందుకున్న డిఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

రోడ్డుపై పడిన చెట్టు....

బైరామల్‌గూడ నుండి సాగర్ రింగు రోడ్డు వైపు వెళ్లే దారిలో ఉన్న ఒక హోటల్ ముందున్న చెట్టు ఈదురు గాలికి ఒక్కసారిగా కూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. అయితే ఆ సమయంలో రోడ్డుపై వాహనదారులు ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి డిఆర్ఎఫ్ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. రోడ్డుపై అడ్డంగా చెట్టును డిఆర్ఎఫ్ సిబ్బంది తొలగించేంత వరకు కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి అక్కడే ఉండి పర్యవేక్షించారు.

పుకార్లు నమ్మొద్దు.. ఇంధన కొరత లేదు

-60 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి
-అనవసరంగా ఫుల్ ట్యాంకులు చేయించవద్దు
-బాటిళ్లు, డబ్బాల్లో విక్రయిస్తే కఠిన చర్యలు
-హైదరాబాద్ సిపి సజ్జనార్

మీడియాతో మాట్లాడుతున్న సిపి సజ్జనార్, కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త:

నగరంలో ఇంధన కొరత ఉందంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పష్టం చేశారు. నగరంలో దాదాపు 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని వెల్లడించారు. ఇంధన సరఫరాపై తలెత్తిన అపోహల నేపథ్యంలో బుధవారం టీజీసీసీసీలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు సీపీతప్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ శ్వేత, సివిల్ సప్లై అధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ ఆయిల్ కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, నగర వ్యాప్తంగా సరఫరా నిరాటంకంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు వచ్చి వాహనాలకు ఫుల్ ట్యాంకులు చేయించుకోవడం వల్ల అకస్మాత్తుగా డిమాండ్ పెరిగి, కొన్ని చోట్ల తాత్కాలికంగా నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయని, దీనిని కొరతగా భావించవద్దని కోరారు. తప్పుడు ప్రచారాల వల్ల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 22న 3,024 కిలోలీటర్ల ఇంధనం అమ్ముడవగా, 23న ఆ సంఖ్య రెట్టింపై 6,400 కిలోలీటర్లకు చేరుకుందని, జనం భయాందోళన చెందడం వల్లే అమ్మకాలు ఈ స్థాయిలో పెరిగాయని తెలిపారు. ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా బాటిళ్లు, డబ్బాల్లో లూజ్ పెట్రోల్ డీజిల్ విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేసే వారిపై నిఘా ఉంచామని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలోని 240 పెట్రోల్ బంకుల్లో పరిస్థితిని సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు.హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.. ఆయిల్ సంస్థలు, సివిల్ సప్లై అధికారులతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా పరిధిలోని 186 బంకుల్లో ఇంధన సరఫరా సజావుగా సాగుతోందని, ప్రజలు అనవసర ఆందోళనతో బంకుల వద్ద రద్దీ పెంచవద్దని కోరారు.

నిత్యావసర సేవలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, క్షేత్రస్థాయిలో యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రూ.60లక్షల మద్యం బాటిళ్ల ధ్వంసం

అత్తాపూర్ మార్చి25,ప్రభాతవార్త :

అక్రమ మద్యం తరలింపుపై ఎప్పటికప్పుడు ఉక్కుపాదం మోపుతున్నామని ఎక్సైజ్ శాఖ పోలీసులు పేర్కొన్నారు. బుధవారం ఉప్పర్‌పల్లిలోని శంషాబాద్ ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ దశరత్,శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియ,శంషాబాద్ ఎఈఎస్ శ్రీనివాస్ రెడ్డి,శంషాబాద్ ఎక్సైజ్ సిఐ దేవేందర్ రావు సమక్షంలో ఆరు నెలల్లో 103 కేసుల్లో సీజ్ చేసిన డ్యూటీ పేయిడ్ ,నాన్ డ్యూటీ పేయిడ్ మద్య బాటిళ్లను రోడ్ రోలర్ సహాయంతో ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ దశరత్ మాట్లాడుతూ....శంషాబాద్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో గోవా ,హర్యానా ,డిల్లీ ,లక్నా తదితర ప్రాంతాల నుండి వివిధ మార్గాల్లో తరలిస్తున్న 103 కేసుల్లో పట్టుబడిన మొత్తం 6859 బాటిళ్లకు సంబంధించిన 3077 లీటర్ల మద్యం,44 బిర్లులను ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు.వీటి విలువ సుమారు 60లక్షల రూపాయలు ఉంటుందన్నారు. అక్రమ మద్యం విక్రయం, తరలింపుపై పటిష్టమైన నిఘా ఉంచామని తెలిపారు.అనుమతులు లేని మద్యాన్ని తరలించడం నేరమని తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితుల అరెస్ట్ ..70 క్వింటాళ్ల కల్తీ పేస్ట్ స్వాధీనం

అత్తాపూర్ మార్చి25,ప్రభాతవార్త :

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చని నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ తయారు చేస్తున్న ముఠా గుట్టు రాటైంది.హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) బృందం, ఫుడ్ అడల్టరేషన్ (ఆహార కల్తీ నియంత్రణ) విభాగం అధికారులతో కలిసి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.ఎం. పహాడీలో గల "డెక్కన్ ట్రేడర్స్" గోడౌన్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న ముగ్గురు నిందితులు సొంత సోదరులు సోహైల్ చరానియా (38),రహీమ్ చరానియా (36),అమిత్ చరానియా (35)లను అరెస్టు చేశారు.వారి నుండి విలువ సుమారు రూ. 3,50,000 విలువ చేసే 70 క్వింటాళ్ల అల్లం వెల్లుల్లి పేస్ట్ ,సింథటిక్ ఫుడ్ కలర్ ప్యాకెట్లు 1 బాక్స్,శాంటిక్ యాసిడ్ టిన్, 01 (40 లీటర్లు) ఆదిత్య బిర్లా కెమికల్స్ 01 బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురు కలిసి ఎం.ఎం. పహాడీలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో గోడౌన్లను నడుపుతున్నారు. వీరు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు గడించడం కోసం శాంటిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సింథటిక్ ఫుడ్ కలర్ మరియు వెల్లుల్లి పొట్టును కలిపి నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నారు. ఈ తయారీ ప్రక్రియ అత్యంత అపరిశుభ్రంగా, ఈగలు, దుమ్ము ధూళి మధ్య జరుగుతోంది. ఇలా తయారు చేసిన ప్రమాదకరమైన పేస్ట్‌ను ప్లాస్టిక్ డబ్బాల్లో నింపి, హైదరాబాద్ నగరంలోని హోల్‌సేల్ కిరాణా దుకాణాలకు మరియు క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.ఈ దాడిలో నిందితులను పట్టుకుని, స్వాధీనం చేసుకున్న సొత్తుతో సహా తదుపరి చర్యల నిమిత్తం అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడి జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. యదేందర్, వారి సిబ్బంది ,అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు.

పాతబస్తీలో నకిలీ డిజిటల్ మార్కెటింగ్ ముఠా అరెస్ట్

చార్మినార్,మార్చి 25 ప్రభాతవార్త : చార్మినార్ జోన్ పరిధిలోని రెయిన్ బజార్ పోలీసులు మల్టీ నెట్‌వర్క్ ఆర్గనైజ్డ్ చీటింగ్ కేసును ఛేదించారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీర్‌చౌక్ ఏసిపి శ్యామ్ సుందర్ బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. పాతబస్తీలోని రెయిన్ బజార్,మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన అమాయకపు ప్రజలను ఆన్‌లైన్‌లో డిజిటల్ మార్కెటింగ్ పేరుతో మోసం చేశారు.ఒక్కొక్కరి వద్ద నుంచి ముష్టి వేల రూపాయలు వసూలు చేశారు.ఈ విషయమై పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన మోస పోయిన 12 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.మోసం చేసిన పాతబస్తీ ఈది బజార్‌కు చెందిన మొహమ్మద్ అక్రమ్ (22).కరీంనగర్‌కు చెందిన మహ్మద్ నౌమాస్ రజా (22)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి మెర్సిడెస్ బెంచ్ కారు.ఆఫిల్ ఐఫోన్లు రెండు,మ్యాక్ బుక్ ఒకటి,పలు రకాల లివింగ్ ప్రొడక్ట్స్,బాడి వాష్,ఎనర్జీ డ్రింక్స్,తేనెను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును రెయిన్ బజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు,వస్తువులు

అధికార పార్టీకి కొమ్ముకాయడం మానుకోండి

- ఉద్యోగాలకు రాజీనామాలు చేసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాండి

- మణికొండ బిఆర్ఎస్ నాయకుల హితవు

నార్సింగి, మార్చి 25 ప్రభాతవార్త :

నార్సింగి సర్కిల్ అధికారుల తీరుపై మండి పడుతున్న మణికొండ బిఆర్ఎస్ నాయకులు.

నార్సింగి సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాయడం మానుకోవాలని మణికొండ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ హితవు పలికారు. బుధవారం మణికొండలో బిఆర్ఎస్ నాయకులు అధికారుల పక్షపాత ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి చెందిన అగ్రనాయకులున్న ఫ్లెక్సీలను వేగంగా తొలగించిన అధికారగణం, అదే ఉత్సాహంను అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను తొలగించడంలో చూపడం లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ వీధి వ్యాపారులకు మద్దతు ఇవ్వడంతో ప్రతీకార భావంతో ఒక వికలాంగుడి దుకాణంను మాత్రమే కూల్చి, ఆయన పక్కనే ఉన్న ఇతరుల దుకాణాలు కూల్చలేదన్నారు. ఇది అధికారుల అమానుషమైన చర్య అన్నారు. ఇటీవల అమృత్ పథకం కింద నెక్నాంపూర్ చిన్న చెరువు ఎఫ్‌టిపి పనులు ప్రారంభించిన సమయంలో సైతం ప్రోటోకాల్ వర్తించని స్థానిక కాంగ్రెస్ నాయకులకు పెద్దపీట వేసి నిర్వహించారని ఆరోపించారు. తటస్థంగా వ్యవహరించాల్సిన అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతుండడం ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేయడమే అన్నారు. అధికారులకు రాజకీయం చేయాలని ఉంటే ఉద్యోగాలకు రాజీనామాలు చేసి, ఇష్టమైన పార్టీల్లో చేరి రాజకీయం చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ పంథాను మార్చుకోవాలని, కాదని పక్షపాత ధోరణితోనే ముందుకెళ్తే బిఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలోనే నిరసనలు వ్యక్తం చేస్తుందని, తదనంతర పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని సీతారాం ధూళిపాళ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కుంభగళ్ల ధన్‌రాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావ్, భానుచందర్, మాల్యాద్రినా యుడు, రాజేంద్రప్రసాద్, సుమనళిని, రఫిక్, మంజు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిపోయిన గుడ్లు, రసాయనాలతో పిల్లల తినుబండారాలు తయారీ

-ముగ్గురు అరెస్ట్

కుళ్లి పోయిన గుడ్లు

మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 25 ప్రభాతవార్త : కాటేదాన్‌లో మధుర మీనాక్షి ఫుడ్ కంపెనీ పేరుతో కుళ్లి పోయిన గుడ్లు,ప్రమాదకరమైన రసాయానాలతో పిల్లల తినుబండారాలు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మైలార్‌దేవ్ పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల కథనం ప్రకారం....కాటేదాన్‌లోని అక్రమ ఆహార తయారీ కేంద్రంపై పోలీసులు దాడి నిర్వహించారు.ఇంద్రసొసైటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకరమైన రసాయనాలు వాడుతూ పిల్లలు తినే డోనట్ బన్స్,కేకులు తయారు చేస్తున్న ముఠాను పట్టుకున్నారు.నిందితులు ఆఫ్రిది అన్సారీ (22),యాసిన్ (32).ఖత్రేషన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.కుళ్లి పోయిన గుడ్లు, రసాయనాలు,సోడియం బెంజోయేట్,స్పోరిక్ యాసిడ్, అమోనియం సల్ఫేట్,యంత్రాలు,మిషన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆడపిల్లలకు కళ్యాణలక్ష్మి భరోసా : ఎమ్మెల్యే శ్రీగణేష్

కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,మార్చి 25 ప్రభాతవార్త: ఆడపిల్లల వివాహాలకు తల్లిదండ్రులకు భారంపడకుండా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక భరోసా కోసం కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ అందజేయడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. తిరుమలగిరి మండల పరిధిలోని 64 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష 116 చొప్పున మంజూరైన కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను బుధవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి డిప్యూటీ తహశీల్దార్ హారిక,సీనియర్ కాంగ్రెస్ నేతలు రేపాల వెంకటేశ్వర్లు, గుజ నాగేందర్ యాదవ్, మురళీ ముదిరాజ్, బల్వంత్‌రెడ్డి,ఉత్తరయ్య, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌లో చెత్తను తొలగించాలి : ఆనంద్ బాబు

కంటోన్మెంట్ సిఈఓను సన్మానిస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు,దేవుడు తదితరులు

కంటోన్మెంట్,మార్చి 25 ప్రభాతవార్త: తెలంగాణలో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరుగాంచిన బోయిన్‌పల్లి మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తా, చెదారం, కుల్లిపోయిన కూరగాయలను తొలగించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుతూ మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు గౌడ్,వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్, కార్యదర్శి వెంకటేశ్వర్లు బుధవారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవిందర్ కుమార్ ద్వివేదిని కలిసి వినతిపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. మార్కెట్ యార్డులో కంటోన్మెంట్ బోర్డు పారిశుద్ధ్య సిబ్బంది విభాగం పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని ప్రతి రోజు తొలగించకపోవడంతో ఈగలు,దోమలు వృద్ధి చెందడంతో పాటు భరించలేని దుర్వాసన వ్యాపించడంతో హమాలీలు, సిబ్బంది రోగాల బారినపడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సిబ్బంది సత్య నారాయణ, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి : డిసి జ్యోతి

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ జ్యోతి

సికింద్రాబాద్, మార్చి 25 ప్రభాతవార్త:
ఆస్తిపన్నుపై ఉన్న వడ్డీని వన్‌ఎమ్ సెటిల్మెంట్ కింద 90శాతం మాఫీ చేస్తున్నట్లు, ఈ అవకాశాన్ని పన్నుచెల్లింపుదారులు వినియోగించుకో సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ తార్నాక సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్ఆర్ జ్యోతి తెలిపారు. ఆస్తిపన్ను వసూల్లలు, 2027 జనగణన అంశంపై సర్కిల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సర్కిల్లోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ అస్తిపన్ను చెల్లింపుదారులకు 90శాతం వడ్డీ మాఫీ పట్ల అవగాహన కల్పించి, ఆస్తిపనున బకాయిలు చెల్లించేలా ప్రోత్సహించాలని సూచించారు. మార్చి 31లోగా బకాయిదారుల నుంచి పన్ను వసూల్ చేయడంలో సిబ్బంది శ్రమించాలన్నారు. బకాయిలు ఉన్న ఆస్తిపన్ను చెల్లింపుదారుల వద్దకు వెళ్లి ఈనెల 31లోగా పన్ను చెల్లించే విధంగా వారిని అప్రమత్తం చేయాలన్నారు. లేదంటే వందశాతం వడ్డీతో పాటు పన్ను చెల్లించాల్సి ఉంటుందన్ని తెలియజేయాలని తెలిపారు. అలాగే 2027 జనగణన ప్రారంభానికి అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు సంధ్య, మల్లికార్జున్, ఏసీపీ పావని, డీఈఈ (ఎస్ఓడబ్ల్యూఎం) నాగమణి, డీఈఈ మాధవి, ఏఈ వేణు, ఏఈ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

గణేష్ దేవాలయానికి రూ.9.13 లక్షల ఆదాయం

గణేష్ దేవాలయం హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది,ధర్మకర్తలు

అడ్డగుట్ట,మార్చి 25 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీగణేష్ దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. జనరల్ హుండీ ద్వారా 9 లక్షల 6581,అన్నదానం హుండీ ద్వారా 16 వేల 683 రూపాయలతో పాటు 122 అమెరికన్ డాలర్స్,40 యూఏఈ డలర్స్,బంగారం 3.50 గ్రాముల బంగారం, 65 గ్రాములు అదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ పి.ప్రభాకర్ యాదవ,ఈఓ రామక్రిష్ణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు నరేందర్ యాదవ్, అంజనేయులు, మల్లేశ్, సంతోష్,శ్రీరామ్, వేణుగోపాల్ చారి, బిక్షపతి,నాగమణిలతో పాటు భక్తుల సమక్షంలో హుండీ లెక్కించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన


విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న విజయారెడ్డి తదితరులు.

జూబ్లీహిల్స్, మార్చి 25, ప్రభాతవార్త:
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ రామకృష్ణ నగర్ ఎర్రమంజిల్‌లో నల్ల పోచమ్మ సమేత రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఖైరతాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పి. విజయారెడ్డితో పాటు సామాజికవేత్త, ఆలయ నిర్మాణకర్త మారంగంటి దీపక్ రెడ్డి విచ్చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని,అమ్మవారి ఆశీస్సులతో పాటు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కార్యనిర్వాహకులు బస్తీ వాసులు పాల్గొన్నారు.

30న అసైన్డ్ భూముల యాజమాన్య హక్కుల సాధనకై 'భూమి హక్కు సభ'


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మైసయ్య, శంకరన్న, నర్సన్న, ప్రభాకర్ తదితరులు

సైఫాబాద్, మార్చి 25 ప్రభాతవార్త: అసైన్డ్ భూముల యాజమాన్య హక్కుల సాధనకై ఈ నెల 30వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'భూమి హక్కు సభ' నిర్వహిస్తున్నామని పలు దళిత సంఘాల తెలిపాయి. ఈ సభలో తెలంగాణ భూ రక్షణ సమితి (టిబిఆర్ఎస్) గౌరవ అధ్యక్షుడు చింత స్వామి, సలహాదారు, రాపోలు రాములు, నాయకులు బొట్ల శ్రీను, జీవనజ్యోతి తదితరులు పాల్గొంటారని రక్షణ సమితి నాయకులు చెప్పారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, మూసి నది పరిరక్షణ సమితి అధ్యక్షుడు మూసి శంకరన్న, చిట్టిపాక ప్రభాకర్, డా.సంద్రు నర్సన్న, రోజారాణి తదితరులు ఈ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు పంచిన అన్ని రకాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని, అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాదీనం చేసుకుని తిరిగి పేదలకే పంపిణి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండి ఏ ద్వారా సేకరించిన భూములకు లేఔట్లు చేసి, దానిలో సగ భాగం లబ్ధిదారులకు ఇవ్వాలని, భూమిలేని ప్రతి దళిత కుటుంబానికి 1 ఎకరం భూమిని పంపిణి చేయాలని, ప్రభుత్వం నియమించే అసైన్డ్ కమిటీలలో అసైన్డ్ భూమి లబ్ధిదారులను కూడా సభ్యుడిగా నియమించాలనిరాష్ట్రంలో అసైన్డ్ భూముల కమీషన్‌ను నియమించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

అంగరంగ వైభవంగా సీతారామ కళ్యాణోత్సవం

-వేడుకలకు రానున్న గవర్నర్ శివ ప్రతాప్‌శుక్లా

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు డాక్టర్ భగవంత్‌రావు,ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠిలు

గోషామహల్,మార్చి 25 ప్రభాతవార్త: చారిత్రాత్మక సీతారాంబాగ్ దేవాలయంనుంచి శ్రీరామనవమి శోభయాత్ర ఈనెల 27వ తేదిన ప్రారంభం అవుతుందని భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ప్రతినిధులు డాక్టర్ భగవంత్‌రావు,గోవింద్‌రాఠిలు తెలిపారు.భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆద్వర్యంలోబుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రతినిధులు మెట్టు వైకుంఠం,మహేందర్‌వ్యాస్, శ్రీరామ్‌వ్యాస్, కరోడిమల్, వై.బాబుగురు,నర్సింహ్మకురుమ,నటరాజ్‌కలిసి వారు మాట్లాడుతూ 27వ తేదిన సీతారామ కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడ జరుగుతుందన్నారు. వేడుకలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్‌శుక్లా ముఖ్య అతిదిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా శ్రీరామనవమి శోభయాత్రను సీతారాంబాగ్ ఆలయం నుంచి ప్రారంభ మవుతుందన్నారు. బోయిగూడ కమాన్,మంగళ్‌హాట్, జాలిహన్‌మాన్, పురానాపూల్ గాంధీవిగ్రహం చౌరస్తా,జుమ్మెరాత్‌బజార్, చుడీబజార్, బేగంబజార్‌చౌరస్తా మీదుగా కోల్సావాడి, భర్తన్ బజార్, సిద్దింబర్‌బజార్, శంకర్‌షేర్‌హోటల్‌ల మీదుగా గౌలిగూడచమన్,రాంమందిర్,పుత్లీబౌలి,కోఠి,సుల్తాన్‌బజార్ ఆంధ్రాబ్యాంకు చౌరస్తా వద్ద బహిరంగసభ జరుగుతుందన్నారు.ఈ శోభయాత్రకు ఉజ్జయినికి చెందిన ఆచార్య స్వామి రామస్వరూప్ బ్రహ్మచారి,స్వామి అద్వితానంద్‌గిరిమహరాజ్ విచ్చేయనున్నట్లు తెపారు. ఈ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నవల్సింది కోరారు.

బిజెపి దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుంది

- రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు శేఖర్ ముదిరాజ్

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026లో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు నీరుడి శేఖర్ ముదిరాజ్.

నార్సింగి, మార్చి 25 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుందని రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్ ముదిరాజ్ పేర్కొన్నారు. గండిపేట మండలంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలకు సిద్ధాంతపరమైన అవగాహన కల్పించడం, సంస్థాగత నైపుణ్యాలు పెంపొందించాలన్న లక్ష్యంతో బుధవారం హిమాయత్‌నగర్‌లో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026ను నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశ ప్రజలలో జాతీయతా భావాలను పెంపొందిస్తూ, అనునిత్యం భారతదేశంను విశ్వగురువుగా మార్చేందుకు ప్రధాని నరేంద్రమోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇతర పార్టీల వలే బిజెపి ఓ రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశ ప్రజలందరిలో ఐక్యత, దేశభక్తి, జాతీయ భావాలను పెంచుతున్న పార్టీని అని వివరించారు. మనదేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోడీ ఏ ఇతర దేశాధినేతల మాట వినడం లేదని, ముందు నాదేశం ఆ తరువాతనే ఇతరులు అన్న పంథాను అనుసరిస్తున్నారని తెలిపారు. రాజకీయంలో గెలుపు, ఓటములు సర్వసాధారణమే అయినా, గెలిచేందుకే సర్వశక్తులు ఒడ్డి ఎన్నికల బరిలో పోరాడాలని అభిప్రాయపడ్డారు. ప్రజల హృదయాలను గెలుచుకునేలా నాయకులు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజల మద్యన ఉన్న నేతలను ప్రజలే గెలిపించుకుంటారని స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలను తూచా తప్పకుండా పాటించాలని, బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టతకు నిరంతరం కష్టపడాలని నీరుడు శేఖర్ ముదిరాజ్ తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహాలింగం గౌడ్, మల్లారెడ్డి, మహేష్ యాదవ్, నరేష్ యాదవ్, పవన్‌సాయి, చంద్రశేఖర్‌రెడ్డి, సాయి యాదవ్, నాగరాజు రెడ్డి, ప్రేమ్ కుమార్, లక్షణ్, గణేష్, అభినయ్, సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీ నీలకంఠేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ సురబి వాణిదేవి

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 25, ప్రభాతవార్త
కెపిహెచ్‌బి కాలనీ ఏడవ ఫేస్‌లోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం గత నాలుగు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతోంది. బుధవారం ఉదయం నుండి ఆలయ ప్రాంగణంలో పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యా శంకర భారతి స్వామి వారిచే ప్రత్యేక పూజల అనంతరం విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సురభి వాణిదేవి హాజరయ్యారు. కాశీ నుండి అన్నదానం చిదంబరం సిబి సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు తాండూరి నరేంద్ర చారి, అధ్యక్షులు వివి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పంచ గంగేశ్వర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 25, ప్రభాతవార్త
కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీవారి 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కోసూరి రామకృష్ణమాచార్యులచే స్వామివారి శాంతి కళ్యాణ మహోత్సవం ఎంతో వైభవోపేతంగా, వైదిక మంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కళ్యాణోత్సవంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు (వివేకానంద నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు) వద్దేపల్లి రాజేశ్వరరావు, యామిని దంపతులు పాల్గొని దివ్య కార్యాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుట ద్వారా స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులైనారు. స్వామివారి కళ్యాణం అనంతరం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది భక్తుల అచంచల విశ్వాసంతో సేవాభావంతో నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు మన సమాజానికి ఆధ్యాత్మిక శాంతి, ఐక్యత, సత్సంకల్పాలను పంచుతున్నాయని అన్నారు. అలాగే, కార్యక్రమాన్ని విజయం వైపు నడిపిన ఆలయ కమిటీ సభ్యులు సేవాదారులను అభినందిస్తూ ఇలాంటి పవిత్ర బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా, తరతరాలకు చిరస్మరణీయంగా ప్రతి సంవత్సరం నిర్వహించబడాలని మన సారా కోరుకుంటున్నానని వారిని అభినందించారు.

వడ్డెరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు మైసయ్య, లక్ష్మణ్, శ్రీను తదితరులు

హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త:
రాష్ట్రంలోని వడ్డెరుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లను నియమించి తగినన్ని నిధులు కేటాయించాలని అఖిల భారత వడ్డెర వడ్డే బోవి బెల్దార్ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో వరికుప్పల శ్రీను అధ్యతన జరిగిన సమావేశంలో జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు వడుగుల మైసయ్య మాట్లాడుతూ వడ్డెర కులస్థులను బిసి-ఎ నుంచి ఎస్టి జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడ్డ వడ్డెర్లను ఏ రాజకీయ పార్టీ కూడా పట్టించుకోవడం లేదన్నారు. వడ్డెర్లంతా ఐక్యమై తమ హక్కులు కోసం ప్రభుత్వాలను నిలదీస్తామన్నారు. జనాభా ప్రకారం వడ్డెర్లకు ఐదు నుంచి ఆరు ఎంఎల్ఎ , రెండు ఎంపి స్థానాలివ్వాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు.ఈ సమావేశంలో సంఘం ఆలిండియా మహిళాఅధ్యక్షురాలు వి.తిరుమల దేవి, యూత్ అధ్యక్షులు వేముల లోకేశ్ నేతలు వి.శ్రీనివాస్, ఎం.శేఖర్, అనుమంత, మంజుల, వేముల సొడయ్య తదితరులు పాల్గొన్నారు

సిడిఎస్ అభివృద్ధికి విరాళం

తార్నాక, మార్చి 25 ప్రభాతవార్త : సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సీడీఎస్) అభివృద్ధి కోసం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పి.వి. రమణ రూ.25,000 విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం సీడీఎస్ వ్యవస్థాపకుడు మల్లేపల్లి లక్ష్మయ్యను మర్యాదపూర్వకంగా కలిసి చెక్కును అందించారు. ఈ సందర్భంగా పి.వి. రమణ మాట్లాడుతూ సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ అనేది షెడ్యూల్డ్ ట్రైబ్స్, షెడ్యూల్డ్ కాస్ట్స్ మరియు ఇతర బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రముఖ సంస్థ అని కొనియాడారు. జూబ్లీహిల్స్‌లోని బుద్ధ భవన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అనేక పరిశోధనలు చేపడుతోందని తెలిపారు.అలాగే ప్రభుత్వానికి సమగ్ర అభివృద్ధి కోసం విలువైన సూచనలు అందిస్తూ సామాజిక మార్పులో సీడీఎస్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. సంస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందజేసినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న సంఘాలు, నాయకులు, ప్రజలందరూ ముందుకు వచ్చి సీడీఎస్ మరియు బుద్ధ భవన్ అభివృద్ధికి విరివిగా విరాళాలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘానికి చెందిన ప్రముఖ సభ్యులు పాల్గొన్నారు.

సమాజానికి సన్మార్గం చూపేవాళ్లు కావాలి : డా. కె.వి.రమణాచారి

పురస్కారగ్రహీతలతో రమణాచారి, ఫణీంద్ర, విజయకుమార్, సుధారాణి హరినాథ్‌బాబు, బాలాజీశర్మ తదితర అతిథులు

నాంపల్లి, మార్చి 25 ప్రభాతవార్త : పేరుకి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన సమాజమైనా ఏక్షణానికి ఏదోవన పోతోందో దిక్కుతోచని అయోమయ సమాజానికి సన్మార్గం చూపించి నడిపించేవాళ్ల ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. అంగరంగ వైభవంగా అమృతోత్సవాలు జరుపుకుంటున్న నవ్య సాహితీ సమితి, నవ్య నాటకసమితి శ్రీపరాభవనామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని వసంతోత్సవం జరుపుకుంటూ వివిధరంగాల్లో సన్మార్గులైన పలువురు సాహిత్య, సంగీత, నృత్య ప్రముఖులను నవ్య వసంతోత్సవ పురస్కారాలతో సత్కరించి గౌరవించడం మంచి సంప్రదాయమని సంస్థలను, నిర్వాహకులను అభినందించారు. డా. ఆచార్య ఫణీంద్ర సభాధ్యక్షతన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు కళావేదికలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి గౌరవ అతిథులు జి.వసుంధర, సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, డా. సిఎల్‌కె.దుర్గ, డా, కుసుమకుమారి, యుహెచ్.హరినాథ్‌బాబు, బాలాజీశర్మ, కృష్ణ కన్నారావు తదితరులతో కలిసి ఆచార్య వంగపల్లి విశ్వనాథం, బాలాంత్రపు వెంకటరమణ, డా. పావని వైజర్సు, డా. వై.చలపతిశాస్త్రి, డా. ఆర్.చంద్రశేఖర్‌లను ఘనంగా సత్కరించి నవ్య వసంతోత్సవ పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖ కవుల కవితాగానం ఆహుతులను తన్మయుల్ని చేశాయి. వేమరాజు విజయకుమార్, ఆర్.ఎన్.సుధారాణి, నిష్టల సుధామాలల సభాసమన్వయంలో నవ్య వసంతోత్సవం విజయవంతంగా ముగిసింది.

ప్రాచీన జానపద కళారూపాల్ని కాపాడుకోవాలి : సారిపల్లి కొండలరావు

-ఘనంగా జానపద కళాకారుల సంక్షేమనిధి పథకం ప్రారంభోత్సవం

జానపదకళాకారుల సంక్షేమనిధి పథకాన్ని ప్రారంభిస్తున్న రమణాచారి, కొండలరావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, లింగయ్య తదితర అతిథులు

రవీంద్రభారతి, మార్చి 25 ప్రభాతవార్త : ప్రాచీనకాలం నుండి కళలకాణాచిగా ఖ్యాతినొందిన తెలుగుజాతి సంప్రదాయ జానపద కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త, కళాబంధ సారిపల్లి కొండలరావు అన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో జానపద కళాకారులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నా సంప్రదాయంగా విస్తున్న జానపద కళలను పరిరక్షిస్తూ తెలుగు సంస్కృతికి కోటలా నిలుస్తున్నారని కొనియాడారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి ఆశీస్సులతో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం ఘనంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సారిపల్లి కొండలరావు ఆత్మీయ అతిథులు లంక లక్ష్మీనారాయణ, వి.శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్య, విజయశ్రీ, మురళీకృష్ణ తదితరులతో కలిసి జానపద కళాకారుల సంక్షేమనిధి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అధ్యక్షోపన్యాసంలో డా. కె.వి.రమణాచారి కళాకారుల సంక్షేమనిధి పథకం మంచి ఆలోచన అయినా కార్యరూపంలోకి తీసుకురావడం చాలా కష్టంతో కూడుకున్న ఆర్థికాంశమని స్పష్టం చేశారు. సారిపల్లి కొండలరావు వంటి వరాణ్యులు ముందుకొచ్చి జానపద కళాకారుల ఆరోగ్య సంరక్షణ, అత్యవసర పరిస్థితుల కోసం ఏర్పడిన సంక్షేమనిధికి ఆర్థికసహాయం అందించడం ఆదర్శప్రాయమని, స్ఫూర్తి మరెంతోమంది ముందుకువచ్చి సహాయసహకారాలు అందించాలని సూచించారు. ఈ సంక్షేమనిధికి డా. మురళీమోహన్, డా. రమణ, మురళీకృష్ణ, రేణుక, ఆర్.ఎస్.బ్రదర్స్, రాజమౌళి వంటి పెద్దలు ఎంతోమంది తమవంతు సహాయాన్ని అందించడం హర్షదాయకమని వారిని అభినందించారు.

గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సైఫాబాద్, మార్చి 25 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొండిశెట్టి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. మాజీ సిఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన జివొ నెంబరు 429ని అమలు చేయాలని, గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులను అరకట్టాలని, నిలిపివేసిన పారా మెడికల్ శిక్షణను కొనసాగించాలని, గ్రామీణ వైద్యులకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని బుధ వారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కోరారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : ఎఐఎస్ఎఫ్

'చలో అసెంబ్లీ ముట్టడి' పాల్గొన్న ఎఐఎస్ఎఫ్ విద్యార్థులు

సైఫాబాద్, మార్చి 25 ప్రభాతవార్త: విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆనేక మంది విద్యార్థులు బుధవారం 'చలో అసెంబ్లీ ముట్టడి' ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు, ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించిన విధంగా విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని వారు కోరారు. విద్యార్థుల ముట్టడి సందర్భంగా ఉద్రిక్తత ఏర్పడటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

సీతారాముల కళ్యాణానికి రావాలి

పిసిసి మహేష్ కుమార్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు హనుమంతరావును ఆహ్వానించిన లక్పతి యాదగిరి గౌడ్

హైదరాబాద్ మార్చి 25,ప్రభాతవార్త :
అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక కూరగాయల మార్కెట్లో హనుమాన్ దేవాలయంలో ఈనెల 27న నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు హనుమంతరావును రావాలని కోరుతూ మాజీ పిసిసి కార్యదర్శి లక్పతి యాదగిరి గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హనుమంతరావు నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ మాట్లాడుతూ... గోల్నాక కూరగాయల మార్కెట్ హనుమాన్ దేవాలయంలో ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బాగ్ అంబర్ పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, కిరణ్, హనుమాన్ నగర్ ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, రజినీకాంత్, ఈ శేఖర్, దుర్గ ప్రసాద్ (చింటూ), ధరన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో శ్రీరామనవమికి అంతా సిద్ధం

ఖైరతాబాద్, మార్చి 25 (ప్రభాతవార్త):
శ్రీరామ నవమి సందర్భంగా ఖైరతాబాద్ పరిధిలో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పలు ప్రాంతాల్లో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు.వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో శోభాయాత్రలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణకు కూడా చర్యలు తీసుకున్నారు.ఇదిలా ఉండగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా ఉత్సవాల్లో పాల్గొనాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు.

సేవకు వస్తూ ప్రమాదానికి గురై మృతి

బేగంపేట మార్చి 25,ప్రభాతవార్త
ఇంటి నుంచి బయలు దేరి బేగంపేట వచ్చి ఆధ్యాత్మిక కేంద్రంలో సేవ చేద్దామనుకుంది.కానీ ఆమె వెళ్లాల్సిన ప్రాంతానికి మరికొద్ది నిమిషాల్లో చేరుకుంటా అనే సమయంలో రోడ్డు దాటుతుండగా స్కూటీ ఆమెను ఢీకొంది.దీంతో తీవ్ర గాయాలపాలైంది.ఇది గమనించిన వారు ఆమెను ఆస్పత్రికి తరలించారు.చికిత్స పొందుతూ మృతి చెందింది.ఈ సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బోరబండ ఎస్పీఆర్ హిల్స్‌లో నివసించే డి.రాణి (45)బేగంపేట ప్రకాశం నగర్‌లోని ఓంశాంతి ఆధ్యాత్మిక కేంద్రం ఉంది.ఈ కేంద్రంలో రాణి సేవ చేసేందుకు వస్తుంది.ఈ క్రమంలో ప్రకాశం నగర్ బస్టాప్ వద్ద దిగి తన స్నేహితురాలు శశికళతో కల్సి రోడ్డు దాటుతుంది.ఈ క్రమంలో పంజాగుట్ట నుంచి సికింద్రాబాద్ వైపు వెళుతున్న ద్విచక్రవాహన దారుదు ఓంకార్ రోడ్డు దాటుతున్న వారిని యాక్టివాతో ఢీ కొట్లాడు.ఈ ప్రమాదంలో రాణి తీవ్రంగా గాయపడగా శశికళ స్వల్పంగా గాయపడింది.వెంటనే స్థానికంగా ఉన్న వారు ఆమెను చికిత్స నిమిత్తం మినిస్టర్ రోడ్డులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాణి మృతి చెందింది.మృతురాలు కుమారుడు ప్రశాత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీ పచ్చళ్ల గుట్టురట్టు.. ఒకరి అరెస్ట్..

-రూ.మూడు లక్షల నిల్వలు స్వాధీనం..

వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.

మెహిదీపట్నం, మార్చి 25, ప్రభాతవార్త : అక్రమ కల్తీ పచ్చళ్ల తయారీ కేంద్రంపై హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఒకరిని అరెస్ట్ చేయడంతో పాటు మూడు లక్షలు విలువ చేసే నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. టాస్క్ ఫోర్స్ డీసీపీ అందే శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జియాగూడ వెంకటేష్ నగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండ అపరిశుభ్రమైన వాతావరణంలో పచ్చళ్లు తయారు చేస్తున్న కె.రవీందర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ (గోల్కొండ టీమ్), కుల్సుంపుర పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్ లో నిందితుడు నాణ్యత లేని ముడి పదార్థాలు, కుళ్లిపోయిన పండ్లు, రాళ్ల ఉప్పుతో కలిపి నిల్వ చేసి, వాటితో పచ్చళ్లు తయారు చేసేవాడు. ఈ కల్తీ ఉత్పత్తులను నగరంలోని వివిధ కిరాణా షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లకు సరఫరా చేస్తూ డబ్బులు సంపాదించేవాడని పోలీసులు గుర్తించారు. 7,000 కిలోల ప్రమాదకరమైన పచ్చళ్లతో పాటు, 2400 కిలోల ఎర్ర మిర్చి పచ్చడి, 4160 కిలోల రాళ్ల ఉప్పుతో నిల్వ చేసిన మామిడి ముక్కలు, నిమ్మకాయలు, 2400 కిలోల ఉసిరి, టమాటా, నిమ్మకాయ పచ్చళ్లను దాదాపు మూడు లక్షల రూపాయల విలువ గల నిల్వలను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వెంకటేష్, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ ఎ. రాములు,ఎస్.ఐలుకె.వెంకటరమణ, కె.శ్వేత సిబ్బంది ఉన్నారు.

గుండెపోచంపల్లిలో యువతి మృతి

పేట్ బషీరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త
గుండెపోచంపల్లిలో ఓ యువతి మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పల్లవి లహరి (19) అనే యువతి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తన కుటుంబంతో కలిసి గుండెపోచంపల్లిలో నివసిస్తోంది. గత సంవత్సరం నుంచి వరంగల్ నివాసి జల్ల సందీప్ (21) అనే యువకుడితో పరిచయం ఏర్పడి, సుమారు ఏడు నెలలుగా అతనితో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు సమాచారం. అయితే వీరిద్దరి మధ్య వ్యక్తిగత, ఆర్థిక విషయాలపై తరచూ వివాదాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు.మార్చి 24 ఉదయం ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. అనంతరం సందీప్ బయటికి వెళ్లిన సమయంలో యువతి గదిలో ఒంటరిగా ఉండి ఒక నోట్ రాసి అనంతరం మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.సుమారు ఉదయం 10:30 గంటల సమయంలో తిరిగి వచ్చిన సందీప్ గది తలుపు లోపల నుంచి మూసివుండటంతో, స్థానికుల సహాయంతో తలుపు బద్దలు కొట్టి లోపలికి వెళ్లగా యువతి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.ఈ ఘటనపై మృతురాలి తండ్రి సంతోష్ లహరి ఫిర్యాదు మేరకు సందీప్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సేఫ్ రోడ్స్ డిక్లరేషన్ ప్రోగ్రామ్

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

జీడిమెట్ల, మార్చి 25, ప్రభాతవార్త

గాజులరామారం సర్కిల్ పరిధిలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం 20వ రోజు సందర్భంగా సేఫ్ రోడ్స్ డిక్లరేషన్ ప్రోగ్రామ్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గుంతలు పూడ్చడం, రోడ్లపై లేన్ మార్కింగ్ మెరుగుదల, ఫుట్‌పాత్‌ల శుభ్రపరిచడం వంటి ముఖ్య అంశాలపై దృష్టి పెట్టారు. సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారి మార్గాలను గుర్తించి లక్ష్య ప్రాంతాలుగా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిఖిల్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహదేవ్ అనురాగ్, అసిస్టెంట్ ఇంజనీర్ కళ్యాణ్ హాజరయ్యారు. ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర రిసోర్స్ పర్సన్స్ కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

ముదిరాజ్, ముత్తరాసి, తెనుగు సామాజిక పునర్వర్గీకరణపై మంత్రులతో సమావేశం

మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడుతున్న కాసాని వీరేష్ ముదిరాజ్

నిజాంపేట్, మార్చి 25, ప్రభాతవార్త

పశుసంవర్థక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జాతీయ ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముదిరాజ్, ముత్రాసి, తెనుగు సమాజాలను బిసి–డి నుండి బిసి–ఎగా పునర్వర్గీకరణ చేయడానికి సంబంధించిన జీఓ ఎంఎస్ నం. 15/2009 పునరుద్ధరణ అంశంపై విస్తృతంగా చర్చించారు. అదే విధంగా, కోకాపేట్‌లో తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్ ఆత్మగౌరవ భవన్ కోసం కేటాయించిన భూమిలో భవన నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు మంత్రులను కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం : జితేందర్‌నాథ్

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న జితేందర్‌నాథ్

అల్వాల్, మార్చి 25 ప్రభాతవార్త:

సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి ఉంటుందని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మా సంతోషీ కాలనీలో 20లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ ప్రారంభించారు. కాలనీలో ఇప్పటికే పార్కును అభివృద్ధి చేయడంతో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, సిట్టింగ్ ఏరియా, లైబ్రేరీ, వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహాయ సహకారాలుతోనే అభివృద్ధి సాధ్యం అవుతోందని తెలిపారు ఈ కార్యక్రమంలో కాలనీ వాసులుతో పాటుగా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 18.14లక్షలు

ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం

జూబ్లీహిల్స్, మార్చి 25, ప్రభాతవార్త:

శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం హుండి లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. మూడు నెలలకు భక్తులు కానుకల రూపంలో హుండీలలో సమర్పించిన వాటిని అధికారులు, ఆలయ నిర్వాహకులు లెక్కించారు. రూ. 18,14,870 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీనివాస శర్మ, సభ్యులు కళ్యాణి, రాజేష్, లక్ష్మణ్, శ్రీకాంత్ రెడ్డి, మధు తదితరుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కొనసాగింది. దేవాలయ సిబ్బంది అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కమనీయంగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం



శ్రీవారి కళ్యాణమహోత్సవం నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి మార్చి 25, ప్రభాతవార్త :

వివేక్ నగర్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణం భక్తి పారవశ్యంలో మునిగితేలింది. బుధవారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, నయనానందకరంగా జరిగింది. ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాదం పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, అర్చకులు వేంకటాద్రి బృందం ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణ ఘట్టం శాస్త్రోక్తంగా సాగింది. స్వామి వారిని, అమ్మవార్లను పట్టు విశేష పుష్పాభరణాలతో అలంకరించి అంగరంగ వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించారు. "గోవింద.. గోవింద.." నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గోళ్లమూడి పద్మావతి తో పాటు పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పునర్నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని, లోక కల్యాణం జరగాలని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి జర్నలిస్టులే వారధి : చిన్నారెడ్డి

వివిధ రంగాలకు చెందిన వారికి పురస్కారాలను ప్రధానం చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి

చిక్కడపల్లి మార్చి 25,ప్రభాతవార్త : సామాజిక సమస్యల పట్ల పాత్రికేయులు స్పందించాలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారు వారధిలా నిలుస్తారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. బుధవారం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతి లయ ఫౌండేషన్ ప్రముఖ గాయని ఆమని, సీల్ వెల్ కార్పొరేషన్ సంయుక్తంగా చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో పాత్రికేయులకు నిర్వహించిన ఉగాది విశిష్ట ప్రతిభా పురస్కారాలఖి ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిదిగా పాల్గొని ప్రసంగించారు. పాత్రికేయ వృత్తిలో రాణిస్తున్న వారిని గుర్తించి గౌరవించే సంప్రదాయం అభినందనీయమన్నారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా శృతి లయ ఫౌండేషన్ జర్నలిస్టులను సత్కరించడం విశేషమన్నారు. కళా పత్రిక సంపాదకుడు రఫీ పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు. జీవన సాఫల్య పురస్కారం ప్రముఖ సినీ జర్నలిస్ట్ డాక్టర్ పొన్నం రవిచంద్ర అందుకోగా సీనియర్ వ్యాఖ్యాత గాయత్రీ రావు, పాత్రికేయులు శ్రీనివాస్ రెడ్డి , పరమేశ్వర్, స్వర్ణప్రియ, స్వరూప, మాధురి, రచన, ముడుంబై శ్రీనివాస్, కల్పనలకు ఉగాది పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో భీమ్ రెడ్డి, కుసుమ భోగరాజు, ఎ. భాస్కర్, బి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు ప్రముఖ గాయని ఆమని స్వరసారథ్యంలో గాయని గాయకులు సుభాష్, కృష్ణప్రసాద్, రాజారావు, ఇందుశ్రీ, శ్రీదేవి తదితరులు ఆలపించిన గీతాలు శ్రోతలను అలరించాయి.

నియోజకవర్గ పునఃవ్యవస్థీకరణలో రిజర్వేషన్ సీట్లను పెంచాలి

-బంజారా భారత్ జాతీయ చైర్మన్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రవీంద్రనాయక్, జగన్ నాయక్, రఘురాం రాథోడ్ తదితరులు

హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త:

పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో బంజారా సమాజానికి రిజర్వేషన్ సీట్లను పెంచాలని బంజారా భారత్ జాతీయ చైర్మన్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణలో గతంలో ఉన్న 7 మైదాన గిరిజన జిల్లాల్లో గిరిజనుల జనాభా 70 శాతానికి పైగా ఉన్నప్పటికీ, స్వాతంత్రం తర్వాత పార్లమెంట్, అసెంబ్లీలలో ఎస్టీ రిజర్వేషన్లు కల్పించలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు తక్షణమే ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన చారిత్రాత్మక తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, బంజారా భాష గోర్ బోలిని రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. తండాలను గిరిజన తండా రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించి, రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్, ఆర్టికల్ 275(1) కింద గిరిజన అభివృద్ధికి కేంద్ర నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమిళనాడు, గోవా, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బంజారాలను, వారి 16 ఉపనామాలతో కలిసి షెడ్యూల్డ్ ట్రైబ్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎస్టీగా, ఢిల్లీలో ఎస్సీగా గుర్తింపు ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా దేశవ్యాప్తంగా బంజారా సమాజాన్ని చైతన్యపరచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా చరిత్రలో విశిష్ట సేవలందించిన బంజారా వీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ సేవాలాల్ విగ్రహాన్ని పార్లమెంట్ భవన్‌లో నగరంలోని బంజార హిల్స్‌లో ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగన్ నాయక్, రఘురాం రాథోడ్, హనుమాన్ నాయక్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ పండుగలకు పోలీసు అనుమతి .. టియూసిపిఏ హర్షం

డీజీపీ శివధర్ రెడ్డి ని కలిసిన తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్

చిక్కడపల్లి మార్చి 25 (ప్రభాతవార్త) : రాష్ట్రంలో రానున్న క్రైస్తవ పండుగలు, ప్రార్థనలు ర్యాలీలకు తెలంగాణ డీజీపీ అనుమతి మంజూరు చేయడం పట్ల తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ డీజీపీకి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మార్చి 29 న మట్టల ఆదివారం, ఏప్రిల్ 3 న గుడ్ ఫ్రైడే ఆరాధన, 4 న భారీ ర్యాలీ, 5 న ఈస్టర్ పండుగ ఆరాధన కార్యక్రమాల నిర్వహణకు, ర్యాలీలకు బందోబస్తుకు డీజీపీ సానుకూలంగా స్పందించి అనుమతులు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిషప్‌లు, పాస్టర్లు మరియు సువార్తికులు తమ తమ ప్రాంతాల్లో నిర్వహించే ప్రార్థనలు, ర్యాలీల సమయాల గురించి స్థానిక పోలీస్ స్టేషన్లలో ముందుగానే సమాచారం అందించాలని కోరారు. తద్వారా పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తారని, కార్యక్రమాల్లో పాల్గొనే వారందరూ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సోలోమన్ రాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బిషప్ తిమోతి, రెవరెండ్ మెన్నో జోయల్, రెవరెండ్ జయకుమార్, సి. బెనోని రిచర్డ్, బి. ప్రేమ్ సాగర్, సి. హేమలత, ఎం. శాలిని, ప్రబోధ్ విల్సన్, పాల్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లకోసం సిపిఎం ఛలో బండ్లగూడ

తహశీల్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

చాంద్రాయణగుట్ట, మార్చి 25, ప్రభాతవార్త : పేదలు గుడిసెలు వేసుకొని నివిస్తున్న చోటే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి.అబ్బాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీ.ఎం.నగర్ మిధాని డిపో నుండి బండ్లగూడ తహశీల్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహశీల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ గ్రామాలలో బతుకు దెరువు లేక నగరంలోని మిధాని డిపో వద్ద గల ప్రభుత్వ స్థలంలో పేదలు గుడిసెలు వేసుకొని 30 ఏళ్లుగా నివిస్తున్నారన్నారు. నాటి నుండి అసౌకర్యాల మధ్య జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు పలుమార్లు సర్వేలు చేసినా ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. ప్రజా ప్రతినిధులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హైదరాబాద్ సౌత్ కార్యదర్శి వర్గ సభ్యులు జీ.విఠల్, ఎం. శ్రవణ్, ఎం.మీనా, పి.నాగేశ్వర్‌రావు, ఎల్.కోటయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కిషన్, లక్ష్మమ్మ, సత్తార్, శశికళ, కృష్ణ, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు



కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనంగా ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతె రోహిత్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఖైరతాబాద్‌జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్‌యాదవ్,కార్యదర్శులు

పేద విద్యార్థుల ప్రతిభను పెంచేందుకు ఉపాధ్యాయుల కృషి అమోఘం : రామకృష్ణారెడ్డి

మణికొండ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత రామకృష్ణారెడ్డి తదితరులు.

నార్సింగి, మార్చి 25 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల ప్రతిభను పెంచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అమోఘమని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మణికొండ ప్రభుత్వ పఠశాలలోని విద్యార్థులకు ఆంగ్లంలో కలిపిరాతను అందంగా రాయడంపై గత పక్షం రోజులుగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధను పెట్టి వారి చేతిరాతను అందంగా మార్చారు. ఈ విధంగా చేసిన ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్, ఉపాధ్యాయులు సంగీత, సుధాలను ఘనంగా సత్కరించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్కారు బడుల్లో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద విద్యార్థులు చదువుతున్నారని, వారికి కార్పోరేట్ స్థాయి విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు తపిస్తున్న తీరు అమోఘమన్నారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సర్కారు చేస్తున్న కృషికి తోడుగా దాతలు,స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారం కూడా అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సీతారాందాస్, ఏర్పుల కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు : ప్రొఫెసర్ క్రిష్ణ చైతన్య

డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.క్రిష్ణ చైతన్య

చార్మినార్,మార్చి 25 ప్రభాతవార్త : విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని,విద్యార్థులు పట్టుదలతో సవాళ్లను ఎదుర్కొని జీవితంలో ఉన్నత రంగాలలో స్థిర పడాలని డీన్ ఫ్యాక్టల్టీ ఆఫ్ కామర్స్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.క్రిష్ణ చైతన్య కోరారు. చార్‌కమాన్‌లో బుధవారం జరిగిన ఎస్‌డి సిగ్నోడియా కళాశాల,రాధాక్రిష్ణ ఉమెన్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆయన డిగ్రీ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగర్వాల్ శిక్షా సమితి ఆధ్వర్యంలో పాతబస్తీలో విద్యను అందిస్తున్నందుకు అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ శిక్షా సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ కేడియో,కార్యదర్శి సి.ఎ.నవీన్ కుమార్,ఎస్‌డి సిగ్నోడియా కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.డాక్టర్ డాల్ పడాల్,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.బద్రీ విశాల్,కరస్పాండెంట్ శివ శంకర్ అగర్వాల్,ఆకాంక్ష జైస్వాల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

- విద్యార్థులకు అవగాహన కల్పించిన జూబ్లీహిల్స్ పోలీసులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి.

జూబ్లీహిల్స్, మార్చి 25, ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్‌లోని నెక్స్ట్ ఎడ్యుకేషన్ సంస్థలో జూబ్లీహిల్స్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసిపి సామల వెంకటరెడ్డి, జూబ్లీహిల్స్ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు సైబర్ నేరాలు పెరుగుతున్న ప్రభావం, వాటి వల్ల కలిగే నష్టాలు, వాటిని ఎలా నివారించుకోవాలనే అంశాలపై విస్తృతంగా వివరించారు. ముఖ్యంగా సోషల్ మీడియా, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డేటింగ్ యాప్‌లు, ఫేక్ కాల్స్, ఫిషింగ్ లింకులు వంటి వాటి ద్వారా జరుగుతున్న మోసాల గురించి ఉదాహరణలతో సహా వివరించారు. విద్యార్థులు అపరిచితుల నుండి వచ్చే లింకులు క్లిక్ చేయకూడదని, తమ వ్యక్తిగత వివరాలు, ఓటిపిలు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచిం చారు. అలాగే, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ సందేహాలను అధికారులను అడిగి నివృ త్తి చేసుకున్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు యువతలో సైబర్ భద్రతపై చైతన్యం పెంచడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

జగద్గిరిగుట్టలో బస్ డిపోను ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

జీడిమెట్ల, మార్చి 25, ప్రభాతవార్త

బడ్జెట్ సమావేశాల్లో 2026–27 భాగంగా హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా అభివృద్ధిపై నగరానికి చెందిన ఎమ్మెల్యేలతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్టలో అధునాతన బస్ టెర్మినల్‌ను నిర్మించాలన్నారు. జగద్గిరిగుట్ట ప్రాంతం నుంచి నగరంతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు నిత్యం వేలాదిమంది ప్రయాణికులు బస్సు ప్రయాణం చేస్తూ ప్రయాణిస్తూ ఉంటారని, తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చే బస్సులు రాత్రి వేళలో హాల్ట్ అవడంవల్ల సరైన సదుపాయాలు లేక రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులోని సర్వే నెంబర్. 223,224,237,238 లోగల ప్రభుత్వ భూమి బస్ డిపోకు అనుగుణంగా ఉండడంవల్ల ఈ ప్రభుత్వ భూమిని అభివృద్ధి పరచాలి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాలకు సరైన ప్రజా రవాణా సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నియోజకవర్గంలోని వివిధ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజా రవాణాలో భాగంగా బాచుపల్లి, నిజాంపేట్ నుంచి సికింద్రాబాద్ (వయా ప్రగతి నగర్, జేఎన్టీయూ, గండిమైసమ్మ), మెహిదీపట్నం (వయా జేఎన్టీయూ), మియాపూర్ టు కూకట్‌పల్లి (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయి నగర్ బాచుపల్లి) మియాపూర్ సికింద్రాబాద్ (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయి నగర్ బాచుపల్లి) మియాపూర్ టు గండిమైసమ్మ (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయి నగర్ బాచుపల్లి) బాలయ్య నగర్ నుంచి బాలానగర్, కెపిహెచ్‌బి నుంచి బాలయ్య నగర్‌కు బస్సు సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. లాల్ సాహెబ్ గూడ నుంచి సికింద్రాబాద్‌కు అదనపు బస్సు సర్వీసు. నూతన బస్సు సర్వీసు 224/జి మియాపూర్ నుంచి మేడ్చల్ వయా ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరా అపార్ట్మెంట్స్, బహదూర్ పల్లి పునః ప్రారంభం 229ఎల్ నాగులూరు నుంచి మేడ్చల్. బస్సు రూట్ పరిధి పెంపులో భాగంగా బస్ నెంబర్ 195, 195పి, 195ఎం అండ్ జీ (ప్రగతి నగర్ కమాన్ నుంచి మల్లంపేట్ వయా బొడ్డు రాయి, శంబీపూర్), బస్ నెంబర్ 229 సికింద్రాబాద్ – బహదూర్ పల్లి బస్సును బౌరంపేట్ క్రాస్ రోడ్ వరకు పొడిగించాలని కోరారు. ఎమ్మెల్యే వివేకానంద్ వినతిపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ త్వరలోనే జగద్గిరిగుట్టలో అధునాతన బస్ టర్మినల్‌తో పాటు బస్ డిపోను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి బస్ డిపోను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కెపి. వివేకానంద్‌తో పాటుగా నగరానికి చెందిన ఎమ్మెల్యేలు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ చోరీలో పురోగతి...ఇద్దరిని గుర్తించిన పోలీసులు

- మరో ముగ్గురి కోసం వేట..- బంగారు ఆభరణాలు స్వాధీనం

నిందితులు మహేష్ షాహి, అప్సర చాంద్ (ఏఐ ఆధారిత చిత్రాలు)

జూబ్లీహిల్స్, మార్చి 25, ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్‌లో వ్యాపారి ఇంట్లో బంగారు వజ్రాభరణాల చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. 15 రోజుల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 25 లోని అనిరుద్ రెడ్డి నివాసంలో పని మనుషులుగా చేరిన నేపాలి ముఠా నేపాలి ముఠా ఆయన ఇంటిని గుల్ల చేసి ఇంట్లోనే దాదాపు రెండు కోట్ల విలువైన బంగారు వజ్రాభరణాలతో పరారైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో టాస్క్ ఫోర్స్ డిసిపి గైక్వాడ్ రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ బృందాలు దాదాపు 10 రోజులుగా గుర్తించేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే పోలీసు బృందాలు నేపాల్ బార్డర్ లో మకాం వేయడంతోపాటు తమకు అందిన సమాచారంతో నేపాల్ లోకి వెళ్లారు. ఈ క్రమంలోనే పోలీసు బృందాలు ఇద్దరు నిందితులు నేపాల్ హద్దును దాటుకొని వెళ్లినట్లు గుర్తించారు. టాస్క్ ఫోర్స్ డిసిపి గైక్వాడ్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు టాస్క్ ఫోర్స్ బృందాలను సమన్వయం చేసుకొని నేరస్తుల జాడను గుర్తించారు. నేపాల్ పోలీసుల సాయంతో చోరికి పాల్పడిన జంటలోని అప్సర అలియాస్ మాయ, మరో నిందితుడు నాగేష్ ను టాస్క్ ఫోర్స్ బృందాలు గురించి అక్కడి పోలీసులకు అప్పగించాయి. వారి వద్ద దాదాపు రూ. 20 లక్షలకు పైగా ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇండియన్ ఇమ్మిగ్రేషన్ అధికారుల సాయంతో వారిని ఇక్కడికి తీసుకొని రావాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా చోరీ అనంతరం ఐదుగురి ముఠా నేరుగా నాగపూర్ వెళ్లి అక్కడి నుంచి డిల్లీకి చేరుకున్నారు. అక్కడ వెండితోపాటు కొంత బంగారాన్ని వదిలేసి పరారయ్యారు. దాదాపు 50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు అక్కడ స్వాధీనం చేసుకున్నారు.

కొత్త అవతారం.. నకిలీ ఆధార్ కార్డులు

చోరీ కోసం మహేష్ షాహి, అప్సర చాంద్ ఇద్దరు భార్యాభర్తల్లా నటిస్తూ వ్యాపారి అనిరుధ్ రెడ్డి నివాసంలో పని మనుషల్లా చేరారు. ఇద్దరికి ముందే వేర్వేరుగా వివాహం అయినప్పటికీ ఇద్దరు కలిసి చోరికి భార్యభర్తల్లా పథకం వేసి ఒక్కటయ్యారు . ఈ క్రమంలోనే ఇద్దరు తమకు సంబంధించి నకిలీ ఆధార్ కార్డులను తయారు చేసి ఉద్యోగంలోకి చేరారు. తప్పుడు చిరునామాతో వారు విధుల్లో చేరినట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించారు. అప్సర షాహి పేరును మాయ చాంద్‌గా గుర్తించారు. మరో వైపు పారిపోయిన ముగ్గురు నిందితులను గుర్తించేందుకు టాస్క్ ఫోర్స్ డిసిపి ఆధ్వర్యంలో అవసరమైన దర్యాప్తును ముమ్మరం చేశారు. మిగిలిన ముగ్గురు నిందితులు చిక్కితే చోరికి గురైన మిగిలిన బంగారు వజ్రాభరణాలు చిక్కే అవకాశం ఉంది.

నకిలీ యాజమాన్య హక్కులతో చీటింగ్

- ప్రధాన నిందితుడి అరెస్టు - పరారీలో నలుగురు బ్రోకర్లు

వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ దేవేందర్. పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు

చాంద్రాయణగుట్ట, మార్చి 25, ప్రభాతవార్త : ఇళ్లకు నకిలీ యాజమాన్య హక్కులను సృష్టించి, అమాయక ప్రజలను మోసగిస్తున్న ఒక ముఠాలోని ప్రధాన నిందితుడిని బండ్లగూడ పోలీసులు బుధవారం అరెస్టు చేసి చీటింగ్ కేసును ఛేదించారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ తలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ నివాసి మొహమ్మద్ నుస్రత్ బేగం ఒక ఇంటిని కొనుగోలు చేసింది. ఆ ఇంటకి యజమానులము తామేనంటూ ముఠా సభ్యులు ఆమెను నమ్మించారు. విశ్వసించిన ఆమె వారికి రూ.3లక్షలు చెల్లించింది. ఆ తరువాత విచారించగా ఆ ఇంటి యజమాలు వారు కారని, తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలాపూర్ ఎర్రకుంట నివాసి, రియల్ ఎస్టేట్ బ్రోకర్ షేక్ ఒమర్ అమూది (24), బార్కాస్‌కు చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ మొహమ్మద్ బిన్ ఉస్మాన్ మస్కతి (పరారీలో ఉన్నాడు), బండ్లగూడ మొహమ్మద్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ బాసిత్ (పరారీలో ఉన్నాడు), అలీ జాబ్రీ (పరారీలో ఉన్నాడు), బండ్లగూడ సిటీ ప్యాలెస్ ప్రాంతానికి చెందిన షాకీర్ హుస్సేన్ (పరారీలో ఉన్నాడు)లు కలిసి ఒక పథకం ప్రకారం నేరాలకు పాల్పడుతున్నారు. వీరు ముందుగా ఇళ్లను అద్దెకు తీసుకుంటారు. ఆ తర్వాత తామే ఆ ఇళ్లకు యజమానులమని నమ్మించి, నకిలీ పత్రాలు సృష్టిస్తారు. అమాయక ప్రజల నుండి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసి ఇళ్లను తనఖా పెడుతుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రధాన నిందితుడు షేక్ ఒమర్ అమూదిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో మొహమ్మద్ బిన్ ఉస్మాన్ మస్కతి, మొహమ్మద్ బాసిత్, అలీ జాబ్రీ, షాకీర్ హుస్సేన్లతో కలిసి చీటింగ్‌కు పాల్పడట్లు అంగీకరించాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నల్గురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆస్థి లావాదేవీలు జరిపే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ దేవేందర్ కోరారు. నగదు చెల్లించే ముందు అసలు యజమానుల వివరాలను, డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. చీటింగ్ కేసును ఛేదించటంలో చురుకుగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌ను, ఎస్ఐ ఎస్. నాగరాజురెడ్డి, సిబ్బందిని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్, చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ ఎ.సుధాకర్లు అభినందించారు. ఎస్సై ఎస్.నాగరాజురెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి: బీఆర్ఎస్

సికింద్రాబాద్, మార్చి 25 ప్రభాతవార్త: ముషీరాబాద్ చౌరస్తాలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో జరిగే రాములవారి కల్యాణనికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, దాతలతో కలిసి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గత మూడు సంవత్సరాలు గా స్వామి వారి కళ్యాణం ఆలయం అరుబయట నిర్వహిస్తున్నట్లుగానే ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచన మేరకు ఈ సంవత్సరం కూడా మరింత ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పవన్ కుమార్ గౌడ్ చెప్పారు. పలువురు దాతలు సహాయంతో కల్యాణ వేదిక, పెళ్లి మండపం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు కళ్యాణాన్ని విక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాట్లు చేస్తున్నట్లు, భక్తుల సౌకర్యం కోసం వాటర్ వర్క్స్ అధికారులు 5వేల వాటర్ ప్యాకెట్లను అందజెస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఏసురి మహేష్, ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివా స్ గౌడ్, శివ ముదిరాజ్, ముక్క శ్రీనివాస్, మహేందర్ గౌడ్, గోవింద్, వెంకట్ శ్రీనివాస్ యాదవ్ ఆలయ అర్చకులు రామ్మూర్తి పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

LOST PASSPORT

★ I, BOMPAGA JOHNSON FRAIZER S/o. BOMPAGA ARON JOHNSON R/o. H.No. 6-6-381/1, Behind Pragatools, Ramaswamy Compound, Gandhi Nagar, SEC'BAD, T.S., While I Am Renovating My above Premises I Lost My Passport Bearing No. H1864947. If Found Cont:- 9121061708.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నిట్ నం. 01/VET/SLPZ/CMC/2025-26 తేది: 24.03.2026

ఈ క్రింది సర్వీసెస్/పనులు కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. క్ర.సం.1. పని యొక్క పరిధి: 2026-27 సంవత్సరానికి CMC, శేరిలింగంపల్లి జోన్‌లో 01.04.2026 నుండి 31.03.2027 వరకు మృత జంతువులను ఎత్తివేయటం మరియు సక్రమ అమ్మకం. కాంట్రాక్ట్ అంచనా విలువ: రూ.25,17,966/-. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ & సమయం: 25.03.2026 మ.1.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేదీ & సమయం: 31.03.2026 మ.3.30 గం. కమ్యూనికేషన్‌కు చిరునామా: డిప్యూటీ డైరెక్టర్ వారి కార్యాలయం, (పశు సంవర్థక శాఖ), శేరిలింగంపల్లి జోన్, CMC, ఫోన్ నం. 9989930358, ఇ-మెయిల్ ఐడి: adw.ghmc@gmail.com తదుపరి వివరాలు @www.eprocurement.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- డిప్యూటీ డైరెక్టర్, (పశు సంవర్థక శాఖ), శేరిలింగంపల్లి జోన్, CMC

DIPR.No.17622-PP/CL/Advt/1/2025-26, తేది: 25.03.2026

మార్కెట్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారాన్ని కృషి : చైర్మన్ లక్ష్మీ

మార్కెట్లో డ్రైనేజీ సమస్యలను పరిశీలిస్తున్న చైర్మన్ చెకోలేకర్ లక్ష్మీ ఇన్చార్జి ఎస్జిఎస్ చిలక నరసింహారెడ్డి, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ, అధికారులు తదితరులు.

మలక్ పేట ,మార్చి 25, ప్రభాతవార్త: మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు చేపట్టనునట్లు హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి పేర్కొన్నారు. మహబూబ్ మాన్షన్ మార్కెట్లో చైర్మన్ చెకోలేకార్ లక్ష్మీ, ఇన్చార్జి ఎస్జిఎస్ చిలక నర్సింహారెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ, జలమండలి డిజిఎం కృష్ణమోహన్, ఎంఏహెచ్ఓ రుద్ర శ్రీనివాస్, పలువురు అధికారులతో కలిసి మార్కెట్లో పర్యటించి డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ చెకోలెకార్ లక్ష్మి మాట్లాడుతూ మార్కెట్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యాను పరిష్కరించడానికి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా మార్కెట్లో త్వరలో ప్రజల సౌకర్యార్థం ఇందిరమ్మ క్యాంటీన్ ను ఏర్పాటు చేయనునట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శరత్ రెడ్డి, కౌంటర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలపై కబ్జాలకు అడ్డుకట్ట.. నేరేడ్ మేట్‌లో హైడ్రా చర్యలు

నేరేడ్ మెట్, మార్చి 25,ప్రభాతవార్త : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే యత్నాలను ఏమాత్రం సహించబోమని, ముఖ్యంగా పార్కులు, చెరువు,ఖాళీ స్థలాలను కాపాడేందుకు హైడ్రా అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటారని జోనల్ ఇన్స్పెక్టర్ విజయ ఆదిత్య స్పష్టం చేశారు.బుధవారం మోలాలి సర్కిల్ పరిధిలోని నేరేడ్మెట్ డివిజన్ వెంకటేశ్వర ఆఫీసర్స్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న సుమారు 3,000 గజాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా రక్షించేందుకు చుట్టూ ఐరన్ పోల్స్ నాటి జాలి కట్టించారు.కాలనీ అధ్యక్షుడు రమేష్ ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు వెంటనే స్పందించి, పార్కు స్థలంగా గుర్తించిన ఈ భూమిని రక్షించడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వ భూముల పరిరక్షణకు బలమైన సందేశం వెళ్లిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు పవన్ , కాలనీవాసులు, బీజేపీ నాయకులు గోపురం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

మల్కాజిగిరి మార్చి 25,ప్రభాతవార్త : పేదల ఆరోగ్యం మెరుగుపరచడానికి బస్తీ దవాఖానాలు అందుబాటులోకి తేవాలని ఉద్దేశంతో మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఇటీవల ఎమ్మెల్యే మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం సమర్పించారు స్పందించిన కలెక్టర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ లావణ్య కు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని హిల్ టాప్ కాలనీలో పేదల కోసం నిర్మించిన బస్తి దవాఖాన భవనాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ తో కలిసి పరిశీలించారు. త్వరలో బస్సు దావకాలను అందుబాటులోకి తీసుకొచ్చి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడతామని డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ లావణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు బైరుఅనిల్, మర్రి శ్రీనివాస్, వెంకటేష్, అశోక్ మరియు హిల్ టాప్ కాలనీ బస్తివాసులు పాల్గొన్నారు

ధర్మనీలయంలో కొనసాగుతున్న శ్రీరామనవమి మహోత్సవాలు



ఎపిఎయు కాలనీలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న కళాకారులు

మలక్ పేట, మార్చ్ 25, ప్రభాతవార్త: ఆస్మాన్ ఘాడ్ డివిజన్ ఏపీఎయు కాలనీలోని ధర్మ నిలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు లో భాగంగా మంగళవారం రాత్రి అమలాపురం జనరంజని కళాకారులు ప్రదర్శించిన వీర అభిమాన్యుడు బుర్రకథ ఆహుతులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, స్వాధిష్ట సేవా సమితి ప్రతినిధులు రుద్రరాజు రమేష్ రాజు, నవీన్ పటాలే, మడిగెల విజయభాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిలు మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తానని తెలిపారు. శ్రీరామనవమి మహోత్సవాలలో భాగంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతోపాటు ఆధ్యాత్మిక నాటకాలు, బుర్రకథల కళాకారులతో పలు ఆధ్యాత్మిక, భక్తి రస కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని వివరించారు. 26వ తేదీ గురువారం సాయంత్రం ఎదురుకోలు, 27వ తేదీ శుక్రవారం శ్రీ సీతారామ కళ్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించనునట్లు తెలిపారు. శ్రీరామ నవమి మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వంజరి వినోద్ కుమార్, మడిగేల లక్ష్మారెడ్డి, చందు ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంలో ముంచెత్తిన గానాలహరి

సైదాబాద్, మార్చి 25 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్ గడ్డిఅన్నారం ఏపిఏయు కాలనీలోని ధర్మ నిలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు ఉదయం నగర సంకీర్తన, శ్రీరామ పూజ, ఏక రుద్రము, శ్రీ వినాయక, శ్రీ సీతారామ చంద్రస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి హోమము, శ్రీ సత్యనారాయణ స్వామి ప్రతము నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు నిర్వహిస్తున్న విశేష కార్యక్రమాలలో భాగంగా బుధవారం సాయంత్రం వై.ఎస్.రామకృష్ణ బృందం భక్తి గానాలహరి అందరిని భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ఈ కార్యక్రమంలో స్వాదిష్ట సేవా సమితి ప్రతినిధులు మడిగల విజయ భాస్కర్‌రెడ్డి, పి.శ్రీధర్‌రెడ్డి, ఆర్.రమేష్ రాజు, పటాలె నవీన్, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉప్పల్‌లో అన్ని డివిజన్లు గెలుపే లక్ష్యం : వజ్రేష్ యాదవ్

హబ్సిగూడలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసు ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 25 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే విధంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిఎం రేవంత్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారని, ఉప్పల్ అభివృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియో జకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి అన్ని డివిజన్లలో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగిరెడ్డి, సుధాకర్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజ య్ కుమార్, ప్రధాన కార్యదర్శి ధర్మా నాయక్, కిషన్ నాయక్, మురళీ ముదిరాజ్, వాసు నాయక్, రాజు నాయ క్, సుమన్ నాయక్, మాలు నాయ క్, శివ రాజ్, చింతల బాబురావు, రాజన్న, గంగా యాద వ్, జావేద్, రామారావు, సాయి కిరణ్, రవి కుమార్, సా యి కుమార్, కుమార్, రాజు, శివ కుమార్, శంకర్ నాయ క్, లింగం నాయక్, వినో ద్ నాయక్, లక్ష్మీ నారాయణ, ధర్మ రాజు, నర్సింగ రావు, కృష్ణ, అఖిల్, ఖలీల్, వినోద్, వేణు , సాయి, ఉమేష్, రంజిత్, మధు, రాజేష్, బి శివ, రాహుల్, గోపి, ప్రణీత్, మహేష్, నరేందర్, సతీష్, పవన్ పాల్గొన్నారు. నాచారం, మల్లాపూర్ నేతలు భావన గౌడ్, సంతోష్ రెడ్డి, నూతల కంటి రాజు, మహేష్ గౌడ్, నెమలి అనిల్, కప్పర సాయి, అనిల్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి. రఫీక్, శ్రీకాంత్ యాదవ్, నామ్ రాజి రెడ్డి, సాగ శ్రీధర్, గరిక సుధాకర్,వెంకట్ రెడ్డి నగర్ నేతలు ఆకారపు అరుణ్ పటేల్, బాలయ్య బాబు, పవన్ వంజరి, అనిల్ కుమార్, షబ్బీర్, కొలపాక అంజయ్య , ఉదయ్, అనిల్ గుప్తా, సమ్మయ్య, సుబ్బు, జెమిని, వేణు తది తరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: కెఎల్ఆర్

పేద రోగులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న కెఎల్ఆర్: చిత్రంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 25 ప్రభాతవార్త: రాష్ట్రంలో పేద కుటుంబాలకు అండగా సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడలోని నియోజకవర్గ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో బుధవారం వివిధ ప్రాంతాలకు చెందిన పేద రోగులకు, వారి సంబంధీకులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ జరిగింది. ఇందులో భాగంగా బడంగ్‌పేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నాదర్‌గుల్ డివిజన్ నేత నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో అల్మాస్‌గూడ వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన మహేందర్ తన వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.40 వేల చెక్కును కెఎల్ఆర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూ పేదల రోగుల పాలిట ఆపన్న హస్తం సిఎం రిలీఫ్ ఫండ్ అని అన్నారు. దీని ద్వారా ఎంతో మందికి వైద్య ఖర్చుల పరంగా ఊరట లభిస్తున్నదని ఆయన వెల్లడించారు. పేదలకు ప్రైవేటు ఆసుపత్రి వైద్య ఖర్చులు భారం కావద్దనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్, ఎల్ఓసిలు అందిస్తున్నదని ఆయన వివరించారు. ఆర్థిక భారం అవుతున్నా ప్రభుత్వం మాత్రం ఏ సంక్షేమ పథకంలో ఎలాంటి కోతలు లేకుండా సిఎం రిలీఫ్ ఫండ్‌ను అర్హులందరికీ అందిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అవసరమైన వారికి వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు అందిస్తున్నదని ఆయన తెలిపారు. అర్హులైన వారు ప్రభుత్వం అందించే సిఎం రిలీఫ్ ఫండ్, ఆరోగ్యశ్రీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కెఎల్ఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, రోగులు, వారి బంధువులతో పాటు వంశీ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా వ్యాపారాలు : పరమేశ్వర్‌రెడ్డి

చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 25 ప్రభాతవార్త : ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని, చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిరు వ్యాపారులు, పోలీసులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ ప్రాంతంలో వీధి వ్యాపారులకు అండగా ఉంటామని,. వీధి వ్యాపారులు రోడ్డున పడకుండా ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. యఁదజావిడిజగా వ్యాపారం చేసుకునేలా అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉప్పల్ రింగురోడ్డులో ఉన్న వరంగల్ బస్టాప్‌ను ఉప్పల్ నల్లచెరువు ప్రాంతానికి తరలించనున్నట్లు తెలిపారు. దీంతో నల్ల చెరువు ప్రాంతంలో ఉన్న వీధి వ్యాపారులను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లాలని ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఆదేశించారు. దీంతో వీధి వ్యాపారులు ఇదే విషయాన్ని పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఏళ్ల తరబడి ఇక్కడనే చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నట్టుగా వాపోయారు. దీంతో పరమేశ్వర్‌రెడ్డి బుధవారం ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రామలింగ రెడ్డి, ట్రాఫిక్ సిఐ నాగరాజు తదితరులతో మాట్లాడి స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ అధికారుల సూచన మేరకు అదే ప్రాంతంలో ట్రాఫిక్ కు ఆటంకం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, వీధివ్యాపారులు పాల్గొన్నారు.

బిసి జన జాగరణ జాతర విజయవంతం చేయాలి : కటకం నర్సింగరావు

సమావేశంలో మాట్లాడుతున్న కటకం నర్సింగరావు

ఎల్.బి.నగర్, మార్చి 25 ప్రభాతవార్త: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో బీసీ జన జాగరణ జాతర కార్యక్రమాన్ని మన ఆలోచన సాధన సమితి (మాస్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 19న నిర్వహిస్తున్నట్లు మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే జన జాగరణ జాతరకార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సిగ్ రావు ఆధ్వర్యంలో బుధవారం కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనలు అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎవరికి ఎలాంటి లోటుపాట్లు కలగకుండా, సజావుగా ముందుకు సాగేందుకు ఎవరెవరు ఏ బాధ్యతలు తీసుకోవాలి అనే అంశంపై చర్చ నిర్వహించారు. బీసీ జన జాగరణ జాతర కార్యక్రమానికి వేలాదిమంది బీసీ ఇంటెలెక్చువల్స్, కార్మికులు, కర్షకులు, మేధావులు, జర్నలిస్టులు, ఉద్యమకారులు, విద్యావంతులు, కవులు, రచయితలు, బీసీ యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనే అవకాశం ఉన్నందున ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామాలు, పట్టణాలు, మండలాలు, జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న బీసీ నాయకులు పాల్గొని జన జాగరణ జాతర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్ , మాస్ ప్రధాన కార్యదర్శి బచ్చునబోయిన శ్రీనివాస్ యాదవ్,కోల భాస్కరరావు, కృష్ణమూర్తి , ఆవుల వెంకట్ యాదవ్, మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర , మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిలు పెదవుర బ్రహ్మయ్య, పెండం లక్ష్మణ్ -దువ్వల శ్రీకాంత్ గంగపుత్ర, జక్కుల బాలరాజు, యాదవ్, కోరంగి దుర్గారాణి, రమ ముదిరాజ్, పద్మ గంగపుత్ర ,కవిత కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర, పోల్కం లక్ష్మీనారాయణ, భరద్వాజ్ ,భగవాన్ నారాయణ ,నరేందర్ ,పూస రవి ,కళ్యాణ , తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులు చెత్తను స్వచ్ఛ ఆటోలో వేయాలి : ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హయత్ నగర్, మార్చ్, 25, ప్రభాతవార్త : 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎంఎంసి కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి బుధవారం హయత్ నగర్ సర్కిల్లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. పద్మావతి కాలనీలోని మెయిన్ రోడ్డులో ఉన్న దుకాణదారులతో మాట్లాడుతూ రోజు చెత్త ఎక్కడ వేస్తున్నారని అడిగారు. దుకాణదారులు చెత్తను స్వచ్ఛ ఆటో లో వేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చెత్తను స్వచ్ ఆటోలో వేయాలని కమిషనర్ సూచించారు. రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా నిర్మాణ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి, జరిమానాలు విధించాలని కమిషనర్ స్పష్టం చేశారు. నగర అందాన్ని దెబ్బతీసేలా ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను వేయడం చట్టరీత్యా నేరమన్నారు.ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రోడ్ల పక్కన ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. రోడ్లు ఎప్పుడూ లిట్టర్ ఫ్రీఖీగా ఉండాలని సూచించారు.పాత సామాన్లు, పాడైపోయిన వస్తువులను లేదా ఇంట్లోని ఇతర వ్యర్థాలను రోడ్లపై వేయకుండా, కేవలం స్వచ్ఛ ఆటో టిప్పర్ల ద్వారానే పంపించేలా నివాసితులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం హయత్ నగర్ సర్కిల్లోని కుమ్మరి కుంట లేక్ లో గుర్రపు డెక్క తొలగించే పనులను అధికారులతోకలిసి పరిశీలించారు.ఈ పర్యటన లో ఎం ఎం సి కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి, హయాత్‌నగర్ సర్కిల్ అధికారులు, ఇంజనీరింగ్ మరియు పారిశుధ్య విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలాన్ని కాపాడాలని వినతి

కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న రామిడి వెంకట్‌రెడ్డినగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

సరూర్‌నగర్, మార్చి 25 ప్రభాతవార్త: బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్ డివిజన్ కిందకు వచ్చే అల్మాస్‌గూడ రామిడి వెంకటొరెడ్డినగర్‌లో కమ్యూనిటీ హాల్ స్థలాన్ని ఆక్రమణలదారుల నుండి కాపాడాలని కాలనీవాసులు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కోరారు. బుధవారం నాదర్‌గుల్ డివిజన్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ అంకంగారి వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాలనీ అధ్యక్షుడు ఎం.అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్.బాషానాయక్, కోశాధికారి వి.శ్రీశైలం, కాలనీవాసులు శ్రీనివాస్, సంతోష్ తదితరులు కెఎల్ఆర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు కాలనీ వెంచర్‌కు సంబంధించిన 1560 గజాల స్థలంలో 800 గజాలు పార్కుగా అభివృద్ధి కాగా మిగిలిన 760 గజాల స్థలం కబ్జాకు గురవుతున్నదని తెలిపారు. ఈ మేరకు సంబంధిత స్థలాన్ని కాపాడాలని కోరారు. అయితే తమ వినతికి స్పందించిన కెఎల్ఆర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సదరు స్థలం చుట్టూ ప్రహరీగోడను నిర్మించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో విస్తృతోపన్యాసాలు

నేరెడ్ మెట్, మార్చి 25,ప్రభాతవార్త : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజిగిరిలో బోటనీ, మైక్రో బయాలజీ విభాగాల ఆధ్వర్యంలో విస్తృతోపన్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంపొందించడంలో ఉపయోగకరంగా నిలిచాయని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం. గుణాకర్ తెలిపారు.బోటనీ విభాగం కార్యక్రమానికి డాక్టర్ ఆర్. లలిత అధ్యక్షత వహించగా, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ ఓ. పద్మజ యాంజియోస్పెర్మ్స్ ఎంబ్రియాలజీ”పై వివరించారు. మొక్కల అభివృద్ధి ప్రక్రియపై స్పష్టత కల్పించారు.మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్చర్ల బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. మాధురి“ఎంహెచ్‌సీ మాలిక్యూల్స్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు”పై ఉపన్యాసం ఇచ్చారు.ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రాజేశ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహకల్ప కాలనీ సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

గృహకల్ప కాలనీ సమస్యలను అసెంబ్లీ విన్నవిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, మార్చి 25 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని చర్లపల్లి ఇందిరా గృహకల్ప కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అసెం బ్లీలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2009లో అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి పాలనలో ఇందిరా గృహకల్ప కాలనీ నిర్మించారిన తెలిపారు. వీటిలో ప్రస్తుతం పైకప్పుల లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, స్లాబ్ పగుళ్ల వంటి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జిహెచ్ఎంసి, ఆర్అం డ్‌బి, జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని తెలిపారు. వీటిలో సుమారు వేల మంది నివాసితులు ఉన్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని, అ లాగే కాలనీ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉప్పల్ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ వర్క్ షాప్ విజయవంతం

ఉప్పల్ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లో పాల్గొన్న వక్తలు దృశ్యం

ఉప్పల్, మార్చి 25 ప్రభాతవార్త : నానో పదార్థాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో నానో మెటీరియల్స్, మైక్రోవేవ్ ఎలక్ట్రిక్స్, స్టడీస్ ఫర్ సస్టెనబుల్ అండ్ బయో మెడికల్ సిస్టమ్స్ పేరుతో రాష్ట్రస్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. సభాధ్యక్షులు డా.కె.విజయ్ కుమార్, సమన్వయకర్తలుగా డా.వి.శ్రీనివాసరావు, కె. గీత వ్యవహరించారు. డా.ఆచార్య ప్రసాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, డా.టి.విశ్వమ్ గీతమ్ విశ్వవిద్యాలయం, డా.బొజ్జా శ్రీధర్ ఐఐసిటి, విశ్రాంత ఉపకులపతి ఆచార్య సాయన్న అతిథులు విచ్చేసి ప్రసంగించారు. నానో పదార్థాలను వివిధ రంగాలలో విస్తృత ప్రయోజనాలను గురించి వక్తలు ప్రసంగించారు. ఫిజిక్స్ విభాగంతో ఎంఒయు కలిగిన ఆంటన్ పార్ సంస్థ మరియు మైక్రాన్ సంస్థ తమ డెన్సిటీ మీటర్, విస్కో మీటర్, ఎబే రిఫ్రాక్టో మీటర్, రామన్ స్పెక్ట్రో మీటర్ వంటి అత్యంత ఖరీదైన, నాణ్యమైన ఉత్పత్తి పరికరాలతో విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృదేవోభవ అనాథాశ్రమంలో నర్సింహాగౌడ్ సేవా కార్యక్రమం



నాదర్‌గుల్ మాతృదేవోభవ ఆశ్రమంలో విశేష అన్నదానం ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ సామ నర్సింహాగౌడ్

సరూర్‌నగర్, మార్చి 25 ప్రభాతవార్త: మతిస్థిమితం లేని అభాగ్యులను ఆదరిస్తున్న నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ ఆశ్రమంలో బుధవారం బడంగ్‌పేట్ నగర పంచాయతీ/ మున్సిపాలిటీ మొట్టమొదటి చైర్మన్ (ప్రస్తుత మాజీ చైర్మన్), తెలంగాణ మేయర్స్ అండ్ మున్సిపల్ ఛైర్మన్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సామ నర్సింహాగౌడ్ సేవా కార్యక్రమం నిర్వహించారు. తన జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అనాథల మధ్య వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం ఆయన ఆశ్రమంలోని అనాథలు, మతిస్థిమితం లేని అభాగ్యులకు విశేష అన్న దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తిగా ఉందని అన్నారు. నాదర్‌గుల్ మాతృదేవోభవ ఆశ్రమంలో జరిగిన కార్యక్ర మంలో నర్సింహాగౌడ్ కుటుంబీకులు సా మ లక్ష్మీ, సామ చంద్రశేఖర్ గౌడ్, సామ శ్రీకిషన్‌గౌడ్, సామ నృసింహగౌడ్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్‌లు అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 25 ప్రభాతవార్త : సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పంగ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ స్వరూప్‌రెడ్డినగర్ కాలనీకి చెందిన గూడు కుమార్, గూడు హరీష్‌లకు సిఎం సహాయనిధి కింద మంజూరైన చెక్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సిఎం సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలు

-తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు వెంకటరమణ

సీతారామ కళ్యాణ మహోత్సవానికి విచ్చేయాలని కోరుతూ ఇన్చార్జి ఎస్ జి ఎస్ చిలక నర్సింహారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చేగురి వెంకటరమణ, చిత్రంలో మైలా రవికాంత్, మారెప్ప రాజు, అనిల్ ,తల్లం శ్రీకాంత్ తదితరులు.

మలక్ పేట, మార్చ్ 25, ప్రభాతవార్త: మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లోని శ్రీశ్రీశ్రీ గరుడ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 27వ తేదీన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేకూరి వెంకటరమణ పేర్కొన్నారు. మార్కెట్లోని అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్చార్జ్ ఎస్జిఎస్ చిలక నరసింహారెడ్డిని చేగురి వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా చేగురి వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్, దేవస్థానం వారి ఆధ్వర్యంలో మార్కెట్లో నిర్వహించనున్న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి వ్యాపారస్తులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కళ్యాణ మహోత్సవం అనంతరం తీర్థ ప్రసాదము మరియు అన్నప్రసాదం స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు గంగా బాలాజీ, టి. శ్రీకాంత్, జి. నాగరాజు, జీ.రాము పంతులు తదితరులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు మైల రవికాంత్, టి. అనిల్ కుమార్, వెంకటేష్, మారెప్ప రాజు, తల్లం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎసిపి చక్రపాణిని కలిసిన ఆచార్య ఆత్మీయ బృందం

జవహర్ నగర్ డివిజన్ ఏసిపి చక్రపాణిని సన్మానిస్తున్న ఆచార్య ఆత్మీయ సమావేశం బృందం

కుషాయిగూడ, మార్చ్ 25, ప్రభాతవార్త. జవహర్‌నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎసిపి)గా బాధ్యతలు స్వీకరించిన ఎసిపి చక్రపాణి తో పాటు సబ్ ఇన్స్పెక్టర్ మోనికను కాప్రా కు చెందిన ఆచార్య ఆత్మీయ మిత్ర బృందం కలిశారు. ఈ సందర్భంగా ఏసిపినీ వేద బ్రాహ్మణులు శ్రీ విజయ దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సాయి కిరణ్ శర్మ వేద ఆశీర్వచన మంత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, శ్రీ విజయ దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చీఫ్ అడ్వైజర్ ఆచార్య ఆత్మీయ మిత్రబృందం వ్యవస్థాపకులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి, నూతన గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి విజయ్ గౌడ్, ఎన్నారై గన్నోజు ప్రభాకర్ , జై జవాన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ఎస్ఎం సాహెబ్, విజయదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయం గడపలు, కృష్ణశిల ద్వారాలకు పూజలు

దేవాలయ గడపలు, ద్వారాలకు పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, మార్చి 25 ప్రభాతవార్త: సైదాబాద్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయం పునఃనిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. బుధవారం దేవాలయం గడప, అంతరాలయం గడపలకు పూజలు నిర్వహించి అమర్చారు. కృష్ణశిలతో చేసిన ద్వారాలను గుడి ప్రవేశ ద్వారానికి, అంతరాలయానికి అమర్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ భక్త కమిటీ అధ్యక్షుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, నాయకులు సుభాష్ చందర్జీ, సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సహదేవ్ యాదవ్, సంగోధి పరమేష్ కుమార్, నిరంజన్ యాదవ్, ముద్దం శ్రీకాంత్‌రెడ్డి, కదారి రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ డివిజన్‌లో మహనీయుల జయంతికి ఏర్పాట్లు చేయాలి

డిసికి వినతి పత్రం ఇస్తున్న మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్

సరూర్‌నగర్, మార్చి 25 ప్రభాతవార్త: వచ్చే నెల ఏప్రిల్‌లో జరిగే బాబూ జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావు బాపూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు మీర్‌పేట్ డివిజన్‌లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను తెలంగాణ అంబేద్కర్ యు వజన సంఘం నాయకుడు, మీర్‌పేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986వ సంవత్సరం నుండి అంబే ద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహనీయుల జ యంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపా రు. ఈ నేపథ్యంలో ఈ సారి కూడా ఉత్సవాలు విజయవం తంగా నిర్వహించేందుకు సర్కిల్ తరపున సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ మేరకు జిల్లెలగూడ క్రాస్ రోడ్డు, మీర్‌పేట్ చౌరస్తాలలో మహనీయుల విగ్రహాలు ఉన్న చోట పూల అలంకరణ చేయించి విద్యుత్, సౌండ్ బాక్సులు, మంచి నీటి వసతి తదితర ఏర్పాట్లు చేయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గొట్టె శివరాజ్, ఆవుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామాలయంలో ఆధ్యాత్మిక శోభ



అత్తాపూర్ మార్చి25, ప్రభాతవార్త : అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లిలోని శ్రీ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.బుధ వారం డాక్టర్ శశి వారి బృంద సభ్యులు అన్నపూర్ణ, శేషు, అపూర్వ,సామ్య,ఈశ్వరి లా నేతృత్వంలో మృ దంగం వెంకటాచార్యులు ఆలపించిన భక్తిబి గేయాలు ఆల రింపచేశాయి. కార్యక్రమం నిర్వాహకురాలు కామేశ్వరి ద్విభా షి, ఆలయ కమిటి ప్రతినిధులు పద్మశ్రీ, వనిత రెడ్డి, జ్యోశి, ఆదర్శ శుక్లా ఏర్పాట్లు నిర్వహించారు.